క్లుప్తంగా

సరిచేశారు..



గోడకు అమర్చిన విద్యుత్ మీటర్

సాక్షి ఎఫెక్ట్..

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయాల ఆవరణలో విద్యుత్ తీగలు, విద్యుత్ మీటర్ ప్రమాదకరంగా ఉన్నాయని సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయం విదితమే. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఈ ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్న నేపథ్యంలో సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ మీటర్, విద్యుత్ తీగలను గోడకు అమర్చి సరి చేశారు. దీంతో సాక్షి దినపత్రికకు ఆ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పండ్లతోటలు సాగుచేసుకోవచ్చు

జమ్మలమడుగు : రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా 25 రకాల పండ్లతోటలను పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో పంచాయతీ సెక్రెటరీ, రైతు సేవా కేంద్రం సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హార్టికల్చర్ హాబ్‌గా చేయాలనే ఉద్దేశ్యంతో ఈనెల 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఉపాధి, ఉద్యానశాఖల సమన్వయంతో గ్రామ సభలను నిర్వహించి రైతులకు ఉపాధి హామీ, హార్టికల్చర్‌ల ద్వారా 25 రకాల పండ్లతోటలను వేసుకోవటానికి ముందుకు వచ్చె రైతుల వివరాలను సేకరించాలని సూచించారు.

అనాథ వృద్ధులకు అన్నదానం



అనాథ వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న రవి శంకర్‌గౌడ్ కుటుంబ సభ్యులు

వేంపల్లె : స్థానిక గండిరోడ్డులో ఉన్న మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. గురువారం వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రవిశంకర్‌గౌడ్ తల్లి కంపరాజు లక్ష్మీదేవమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు అనాథ వృద్ధులకు అన్నదానం, పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె.రవిశంకర్ గౌడ్ మాట్లాడుతూ అనాథలపట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని, వారికి అండగా నిలవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ అనాథ వృద్ధులకు చేయూతనందించాలని, సమాజంలోని నిస్సహాయులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకుడు, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడి చిత్తడే



చిన్నపాటి వర్షానికి ప్రధాన రహదారిలో నిలిచిన నీరు

సింహాద్రిపురం : మండల కేంద్రంలో చినుకు పడితే చిత్తడి చిత్తడే. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు నరక యాతన చూడాల్సిందే. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అప్పట్లో ప్రత్యేక చొరవ తీసుకుని కోట్లాది రూపాయల వ్యయంతో మురుగు కాలువలు, సీసీ రోడ్ల పనులను శరవేగంగా చేపట్టారు. అయితే కొందరు ఇంటి యజమానులు వారి స్థలం విషయంలో కోర్టుకు వెళ్లడంతో ఈ పనులలో వేగం తగ్గాయి. దీనికి తోడు ఎన్నికలు సమీపించి ఎన్నికల కోడ్ రావడంతో కొద్ది మేర పనులు మిగిలిపోయాయి. దీంతో ప్రభుత్వం మారడంతో ఆ పనులు కాస్త నిలిచిపోయాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, నాయకులు చొరవ తీసుకుని అర్ధాంతరంగా నిలిచిపోయిన డ్రైనేజీ పనులను ప్రారంభించి ప్రజల కష్టాలను తొలగించాలని వారు కోరుతున్నారు.

సబ్సిడీ విత్తనాలకు పేర్లను నమోదు చేసుకోవాలి

కడప అగ్రికల్చర్ : కడప మండల పరిధిలో సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాల కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలి కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కడప మండలానికి 30 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు(జనుములు) మంజూరయ్యాయని తెలిపారు. ఈ జనుము విత్తనాలు 10 కేజీల బస్తా ధర రూ. 1090 అయితే ప్రభుత్వ సబ్సిడీ 50 శాతంతో రైతువాటా కింద రూ. 545 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు కోసం రైతు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ తీసుకుని కడపలోని వ్యవసాయశాఖ కార్యాలయ సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు.. రైతు చూపు



మామిడి పంటలో అంతర పంటగా సాగు చేసిన వేరుశనగ పంట

కమలాపురం : వ్యవసాయం భారం కాకూడదని రైతన్నలు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం గడించేందుకు రైతన్నల చూపు ప్రకృతి వైపు మరలుతోంది. అధికారుల ప్రోత్సాహంతో రైతన్నలు సైతం ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. తద్వారా అధిక ఆదాయం గడిస్తున్నారు. ముఖ్యంగా ఎరువులు లేకుండానే కేవలం ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండించేందుకు రైతన్నలు ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా జామ, మామిడి, దానిమ్మ తదితర ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు అంతర పంటలుగా వేరేశనగ, మినుము, కొర్ర తదితర పంటలు సాగు చేసి అధిక ఆదాయం గడిస్తున్నారు.

కషాయాలు తయారీ

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రకృతి వ్యవసాయంలో పంటలు పండించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని అధికారులు చెబుతుండటంతో రైతన్నలు సైతం ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. అవకాశం ఉన్న చోటల్లా ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రైతులు తమ పొలాల్లో సగం విస్తీర్ణంలోనైనా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించేందుకు ముందుకు వస్తున్నారు. మరి కొన్ని చోట్ల ఇంటి పెరట్లో వారికి సరిపడే కూరగాయలు, పండ్ల మొక్కలు నాటించి 365 రోజులు దిగుబడులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



రామాంజనేయరెడ్డి, రైతు

పక్క చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు ఓబులరెడ్డి రామాంజనేయరెడ్డి, కమలాపురం మండలం బయన పల్లె గ్రామం. తనకు ఎల్లారెడ్డిపల్లెలో ఉన్న 2.5 ఏకరాలలో కొర్రపంట సాగు చేశాడు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో అధికారుల సలహాలు, సూచనలు పాటించి మంచి దిగుబడి సాధించాడు. ఎకరా విత్తనాకు రూ.700, సేద్యంకు రూ.2800, కోత కూలీ ఖర్చులు రూ.3000, పై ఖర్చులు మరో రూ.1500. జీవామృతం అధికారులే ఉచితంగా ఇవ్వడంతో ఏకరాకు రూ.8వేలు ఖర్చు కాగా, 12 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. సాధారణ వ్యవసాయంలో క్వింటా కొర్ర రూ.2600 ఉండగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించినందున క్వింటా రూ.3000 ధర పలికింది. దీంతో 12 క్వింటాళ్లకు రూ.36 వేలు వచ్చింది. ఖర్చు రూ.8వేలు పోగా ఏకరాకు రూ.28వేలు ఆదాయం వచ్చింది.

తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం గడించవచ్చు



ప్రస్తుత తరుణంలో ఎరువులకు అధిక డబ్బులు వెచ్చించాల్సి వస్తుంది. అదే ప్రకృతి వ్యవసాయంలో అయితే తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వచ్చే పంటలు సాగు చేయవచ్చు. అలాగే దీర్ఘ కాలిక పంటలైన మామిడి, జామ తదితర పంటల్లో అంతర పంటలు కూడా సాగు చేసి ఆదాయం గడించవచ్చు. అలాగే భూములు లేని రైతులు తమ ఇంటి పెరట్లోనే పంటలు సాగు చేసుకోవచ్చు. ఇలా మండలంలో వంద మందికి పైగా ఇంటి పెరట్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయించాము. ఈ ఏడాది 1004 మంది రైతులతో 1251 ఏకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలుగా సాగు చేయించేందుకు టార్గెట్ విధించుకున్నాం. దానికి అనుగుణంగా రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. మంచి ఆదాయం గడిస్తున్నారు.

– లత కుమారి, యూనిట్ ఇన్‌చార్జి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, కమలాపురం.

రైతులకు మంచి అవగాహన కల్పిస్తున్నాం



క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రకృతి వ్యవసాయం చేయడం పట్ల రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎరువులు లేకుండానే తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం గడించేలా పంటల సాగు చేయవచ్చని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతుల నుంచి స్పందన చాలా బాగుంది. చాలా మంది రైతులు తమ పొలాల్లో పంటలు సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది టార్గెట్ పూర్తి చేస్తాం.

–సోని, ఐసీఆర్‌సీ, వీఓ–2, టి.చదిపిరాళ్ల, కమలాపురం మండలం

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కమలాపురం : పట్టణంలోని పడమట వీధి సమీపంలోని చెరువుగట్టుపై వెలసిన శ్రీ వజ్రాల(వరాల) సుంకులమ్మ తల్లి 9వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు, భక్తులు విశేష సంఖ్యలో హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు. అలాగే 17న ఉదయం 8 గంటలకు సేద్యపు ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.1వెయ్యి నగదు బహుమతులు ఇవ్వనున్నారు. అలాగే 18న సీనియర్ విభాగం ఎద్దులచే నిర్వహించే పోటీలకు వరుసగా రూ.70వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేయనున్నారు.

దేవస్థానానికి అదాయం

జమ్మలమడుగు రూరల్ : మోరగుడి గ్రామంలోని చెన్నకేశవస్వామి దేవస్థానంకు సంబంధించిన భూముల వేలం పాటలో అధిక ఆదాయం లభించింది. గురువారం ఆలయ అధికారుల సమక్షంలో వేలం పాట నిర్వహించారు. గత 3 సంవత్సరాల క్రితం 11 ఏకరాల భూమికి నిర్వహించిన వేలం పాటకు దేవస్థానానికి కేవలం రూ.25 వేలు రాగ గురువారం అధికారులు నిర్వహించిన వేలం పాటలో దేవస్థానానికి రూ.2.59 లక్షలు ఆదాయం రావడం గమన్హరం.

రామాయణం ద్వారా మంచి నడవడిక

పులివెందుల టౌన్ : రామాయణం ద్వారా మంచి నడవడిక అలవాటవుతుందని తవాస్మి సంస్థ ప్రతినిధి శ్రీరామ చక్రధర్ తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక శ్రీసరస్వతి విద్యా మందిరం ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఆయన విద్యార్థులకు తవాస్మి సంస్థ రామాయణం ఆధారంగా పర్సనాలిటీ డెవెలప్‌మెంట్ క్లాస్ నిర్వహించి మాట్లాడారు. రామాయణంలోని ఒక ఘట్టం ఒక పాత్ర మనకు ఎలాంటి సందేశాన్ని ఇస్తుందో సవివరింగా వివరించారు. అలాగే రాముని యొక్క విశిష్టతను, విద్యార్థులు మంచి నడవడిక ద్వారా ఎటువంటి ఫలితాలు పొందగలరో తెలియజేశారు. అనంతరం తవాస్మి సంస్థ ప్రతినిధులు శారదా దీప్తి, జాహ్నవిలు రామాయణం ఆధారంగా పర్సనాలిటీ డెవెలప్‌మెంట్ గురించి వివరించారు. అనంతరం వారు రామాయణంపై మక్కువతో పదేళ్లకుపైగా రీసెర్చ్ చేసి తవాస్మి అనే పుస్తకాన్ని రూపొందించి సమాజానికి అందించారు. ఈ పుస్తకాన్ని అప్పటి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా ఆవిష్కరించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ మీనాక్షి, సరస్వతి విద్యా మందిరం పాఠశాల ఇన్‌చార్జి సరిత, పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్ కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఎండ తీవ్రతపట్ల అప్రమత్తంగా ఉండాలి

పులివెందుల టౌన్ : ప్రస్తుత కాలంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంవల్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్లు సుజాత, హుస్సేన్‌బీలు తెలిపారు. గురువారం స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎండ తీవ్రత – వీచే వేడి గాలులపట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండల తీవ్రతలకు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కనీసం ప్రతి రోజు 3 నుంచి 5 లీటర్ల నీటిని తాగాలని సూచించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను నీటిలో కలుపుకుని తాగాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జోజిరెడ్డి మాట్లాడుతూ ఎండలకు బయట తిరగడం మంచిది కాదని, దానివల్ల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జోజిరెడ్డి, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సురేష్‌బాబు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని కొక్కరాయపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం డిప్యూటీ ఎంపీడీఓ జి.సురేష్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ కూలీలకు తడి చెత్త, పొడి చెత్త గురించి అవగాహన కల్పించారు. వేసవి ఎండలకు వడ దెబ్బ తగలకుండా పని ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేసి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో పర్యటించి చెత్త సేకరణ గురించి ఆరా తీసి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఇవ్వాల్సిన ఆవశ్యకత వివరించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను సందర్శించి పంచాయతీ కార్యదర్శి, క్లాప్ మిత్రలకు పారిశుద్ధ్యం పైన సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు, గ్రీన్ అంబాసడర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

చింతకొమ్మదిన్నె : జాతీయ సేవా పథకంలో భాగంగా తాడిగొట్ల గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ లావణ్య, వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 125 పశువులకు ×డీటిక్కింగ్స్ నిర్వహించి పిడుదుల ముందును పశువుల శరీరంపై పిచికారి చేయించారు. దీనివలన గోమార్లు బాధ నుంచి పశువులకు ఉపశమనం కలుగుతుందన్నారు. లేగదూడలకు నట్టల నివారణకు సూచనలు తెలిపి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ పాండురంగ మాట్లాడుతూ గ్రామ ప్రజలు తప్పనిసరిగా పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీలను తొలగించడం అన్యాయం



వినతిపత్రం ఇస్తున్న వంట ఏజెన్సీ నాయికులు

జమ్మలమడుగు : రాజకీయ ఒత్తిళ్లతో వంట ఏజెన్సీలను తొలగించడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా, ఏఐటీయూసీ నాయకుడు దండు రవిలు తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏవో నిజాముద్దీన్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎర్రగుంట్ల మండలం రాణివనంకు చెందిన ఎస్.కమాల్‌బాషా, హాజీవల్లిలకు అకారణంగా వంట ఏజెన్సీలను రద్దు చేసి మరోకరికి కేటాయించారు. దీంతో వారు కోర్టుకు వెళ్లడంతో కోర్టు తిరిగి వారినే కొనసాగించాలని తీర్పు ఇచ్చింది. అయినా విద్యాశాఖాధికారులు కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడంతో ఏకారణం చేత తొలగించారన్న విషయాన్ని మాత్రం చెప్పడంలేదన్నారు. వంట ఏజెన్సీలను తిరిగి కొనసాగించేవిధంగా ఆదేశాలు ఇచ్చి తమకు న్యాయం చేయాలన్నారు.

నేడు గ్రామ సభలు

లింగాల : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉద్యాన శాఖ నూతన ప్రతిపాదనలపై అవగాహన కార్యక్రమం గ్రామసభలు నిర్వహించనున్నామని, ఈ గ్రామసభలను ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి పండ్ల తోటల రైతుల గుర్తింపు సదస్సులు

సింహాద్రిపురం : మండలంలోని 20 గ్రామ పంచాయతీలలోని సచివాలయాల్లోని పలు గ్రామాలలో పండ్ల తోట పెంపకాల రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. 25 రకాల పండ్ల తోటల పెంపకాలను ఉపాధి, ఉద్యాన శాఖ ద్వారా మొక్కలు అందిస్తారని, ఏ పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి చూపుతారో ఆ పండ్ల తోటల పేర్లను సదస్సులో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఈ సదస్సులకు ఇన్‌చార్జి ఆఫీసర్లుగా ఏవో శివమోహన్‌రెడ్డి, ఏపీఓ జయ భారతి, ఈసీ శ్రీనివాసులరెడ్డి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ వెంకటరాముడులు హాజరై వివరిస్తారన్నారు. ఈనెల 23వ తేదీన రైతుల జాబితా సిద్ధమవుతుందని, ఈ సదస్సులను ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రసాయనిక ఎరువులకు స్వస్తి పలకాలి



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

లింగాల : పంటల సాగులో ఘన జీవామృతం తయారు చేసుకుని రసాయనిక ఎరువులకు స్వస్తి పలకాలని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి జయనాయక్ తెలిపారు. గురువారం దిగువలింగాల గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ కన్వర్జెన్సీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిలోని ప్రతి జీవి ఆరోగ్యాన్ని కాపాడతారన్నారు. ఘన జీవామృతం తయారు చేసుకోవడంవల్ల భూమి ఆరోగ్యంగా ఉండి దిగుబడి బాగా పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామాంజనేయులు ఘన జీవామృతం తయారు చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు



దోమల మందు పిచికారి చేస్తున్న సిబ్బంది

చింతకొమ్మదిన్నె : దోమల నియంత్రణ కోసం మండలంలోని గ్రామాల్లో ఏసీఏం మందు పిచికారీ చేస్తున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి మురళి తెలిపారు. గురువారం ఆజాద్‌నగర్‌లోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో జరుగుతున్న పిచికారీ కార్యక్రమాన్ని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్ర, ఈఓపీఆర్డీ వెంకట సుబ్బారెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి



వెల్లటూరులో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏఓ జి.పి.ఓబులేసు

పెండ్లిమర్రి : ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే రైతులకు ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు తెలిపారు. గురువారం మండలంలోని వెల్లటూరు, నందిమండలం గ్రామాల్లోని పురుగు మందుల దుకాణాలను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి ఎరువులు, మందుల గొడలను తనిఖీ చేశారు. మందులు విక్రయించిన ప్రతి రైతుకు బిల్లు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై బాలికలు జాగ్రత్త వహించాలి



టీనేజీ గర్భంపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా బేగం

వేంపల్లె : ఆరోగ్యంపై బాలికలు జాగ్రత్తలు వహించాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీవున్నీషా బేగం తెలిపారు. గురువారం మండలంలోని తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దళితవాడ, వేంపల్లె-1లోని అంగన్‌వాడీ కేంద్రంలో టీనేజ్ ప్రెగ్నెన్సీపై బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీనేజ్ వయస్సులో గర్భవతి కావడం మంచిది కాదన్నారు. 13 ఏళ్ల నుండి 19 ఏళ్ల మధ్య ఉండే వయస్సు గల బాలికలను టీనేజర్స్ అంటారని, టీనేజ్ వయస్సులో ఉన్న బాలికలకు శరీరంలో మార్పులు అనేవి ఉండవన్నారు. ఆ వయస్సులో టీనేజ్ ప్రెగ్నెన్సీ కావడంపట్ల పిల్లల చదువు ఆగిపోవడంతోపాటు ఆర్థికంగా ఇతరులపై ఆధార పడతారన్నారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలో నెలలు నిండకుండానే కాన్పు కావడం జరుగుతుందని, రక్తహీనత, పోషకాహార లోపం, కాన్పు సమయంలో రక్త స్రావం, కాన్పు తర్వాత రక్త స్రావం జరగడం లాంటివి ఉంటాయన్నారు. మాతృ మరణాలు, శిశు మరణాలు జరగవచ్చునన్నారు. గర్భవతి కావడానికి సరైన వయస్సు 20 ఏళ్ల నుండి 30 ఏళ్లు అన్నారు. గర్భం దాల్చే వయస్సు కంటే తక్కువగా ఉన్నప్పుడు పూర్తిగా శరీరం ఎదుగుదల లేకుండా ముందే ప్రెగ్నెన్సీ అయితే దాన్ని టీనేజ్ ప్రెగ్నెన్సీ అంటారని చెప్పారు. బాల్య వివాహాలు అనర్థాలకు దారి తీస్తాయని, బాల వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేసిన తల్లితండ్రులు, పురోహితులకు, ప్రోత్సహించిన బంధువులకు చట్టం ప్రకారం శిక్ష అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, మహిళా పోలీసు అర్చన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈసెట్‌లో లయోలా విద్యార్థుల ప్రతిభ

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక లయోలా పాల్‌టెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈసెట్‌లో స్టేట్ ర్యాంక్స్ సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంట్రెన్స్ టెస్ట్(ఈసెట్)లో తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ బ్రిట్టో తెలిపారు. గురువారం ఆయన తెలుపుతూ మైనింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగాలలో టాప్ స్టేట్ ర్యాంక్‌లు సాధించారన్నారు. మైనింగ్ విభాగంలో బాల మహేష్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించి కళాశాలకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చారన్నారు. అదేవిధంగా పఠాన్ రాకిబ్‌ఖాన్ 3వ ర్యాంక్, గణేష్ 6వ ర్యాంక్‌లు సాధించగా, కంప్యూటర్ విభాగంలో రాజశ్రీ 5వ ర్యాంక్, సిరి అన్నారెడ్డి 50వ ర్యాంక్, రాకేష్ రెడ్డి 74వ ర్యాంక్, మదన్ మోహన్‌రెడ్డి 77వ ర్యాంక్‌లు సాధించారన్నారు. తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంక్‌లు సాధించడంపట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పాలీసెట్‌లో మెరిసిన విద్యార్థులు

పులివెందుల టౌన్ : పాలీసెట్ పరీక్షా ఫలితాలలో ఉచిత కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. పాలీసెట్ ప్రవేశాలకు స్నేహిత అమృతహస్తం సేవా సమితి, ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ నిర్వహించారు. ఈ కోచింగ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు పాలీసెట్ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. గురువారం పట్టణంలోని స్థానిక రమణప్ప సత్రంబడి పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం, ఎస్‌ఏహెచ్‌ఎస్ సంస్థ అధ్యక్షుడు రాజులు హాజరైన ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు నియోజకవర్గ అధ్యక్షుడు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగపు జిల్లా కోశాధికారి రాఘవేంద్రారెడ్డి సేవా సమితి బృందం తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్‌లో ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థులు

పాలీసెట్‌లో సుందరేశ్వర్ 120మార్కులకు 110మార్కులు పొంది 1642వ ర్యాంక్ సాధించారు. అలాగే పురందేశ్వరి 2462, సాత్విక్‌రెడ్డి 2490, నాగశ్రీహర్షిణి 3558, శ్రావణి 4720, సుహానా 4890, జ్యోష్న 6122, హాసిక 6424, భావన మాధురి 6496, మోహిత్‌రెడ్డి 6672, రూప రెడ్డి 7095, దుర్గా నాగేంద్ర 7124, యామిని 7964, వైష్ణవ్ 8300, భవ్య 9203, ప్రణతి 10604 ర్యాంక్‌లు సాధించారు.

మెడికల్ కళాశాలను వెంటనే ప్రారంభించాలి



మెడికల్ కళాశాల భవనాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాల పూర్తై ఏడాది కావస్తున్నా ప్రారంభించకపోవడం గర్హణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసిరెడ్డి, ధృవకుమార్‌రెడ్డిలు తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక కడప రోడ్డులో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను వారు పరిశీలించి మాట్లాడారు. రూ.670 కోట్లతో పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలను సర్వాంగ సుందరంగా నిర్మించారన్నారని, 2024-25 విద్యా సంవత్సరానికి నేషనల్ మెడికల్ కమిషన్ 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేసిందని, మౌలిక సదుపాయాలు లేవని, సిబ్బంది కొరత ఉందని సాకులు చూపి మంజూరు చేసిన ఎంబీబీఎస్ సీట్లను వద్దని కూటమి ప్రభుత్వం నేషన్ మెడికల్ కమిషన్‌కు లేఖ రాయడం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. అన్ని రాష్ట్రాలు అడిగి ఎంబీబీఎస్ సీట్లు తెచ్చుకుంటూ ఉంటే చంద్రబాబు ప్రభుత్వం మంజూరైన సీట్లు వద్దనడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అసమర్థత కారణంగా ఆంధ్రప్రదేశ్ 2024-25లో 700 ఎంబీబీఎస్ సీట్లను, 2025-26లో మరో 700 ఎంబీబీఎస్ సీట్లను కోల్పోయిందన్నారు. పులివెందుల, ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పార్వతీపురం, అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం, పెనుకొండ, పాలకొల్లు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించడం శోచనీయమన్నారు. దీంతో ప్రతిభా వంతులైన పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు బియ్యాన్ని అందజేయాలి

వేంపల్లె : తెల్ల రేషన్ కార్డులు ఉన్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం అందజేసే రేషన్ బియ్యాన్ని డీలర్లు సరఫరా చేయాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి ఆదేశించారు. రేషన్ డీలర్లు సక్రమంగా పంపిణీ చేయలేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో గురువారం వేంపల్లెలోని పలు రేషన్ షాపులను ఆయన తనిఖీలు చేసి స్టాకును పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసే నిత్యావసర సరుకులను ప్రతి కార్డుదారునికి సకాలంలో అందజేసి డీలర్లు ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే అలాంటి డీలర్లపై చర్యలు తీసుకుంటామని, తూకాలలో కూడా మోసం చేయకుండా ప్రజలకు బియ్యం పంపిణీ చేయాలని కోరారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత రేషన్ డీలర్లపై ఉందన్నారు. బియ్యం పంపిణీ కావడంలేదని కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, బియ్యం నిల్వ ఉన్న డీలర్లు అందరూ బియ్యం పూర్తిగా అయిపోయే వరకు పంపిణీ చేయాలన్నారు. ఆర్ఐ లోకేష్, డీలర్ ఈశ్వరయ్య, వీఆర్ఓలు పాల్గొన్నారు.